RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 207 | జులై 13, 2025 | వెల : రూ.3-00



## జమ్మికుంటలో వరుస చోరీలు

3లో..



# స్వచ్ఛ వరంగల్ ఉట్టి మాటేనా..?

- పరిసరాలపై కనీస పట్టింపు లేదా?
- పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే ఇదీ దుస్థితి..
- ఇబ్బడి ముబ్బడిగా పేరుకుపోయిన చెత్తాచెదారం

**వేద న్యూస్, వరంగల్:**

స్వచ్ఛ వరంగల్ అంటూ ప్రభుత్వాలు చేసే ప్రకటన ఉట్టి మాటేనా? అని గ్రేటర్ వరంగల్ వాసులు ఆవేదన వ్యక్తం చేసేలా పరిస్థితులు ఏర్పడ్డాయనీ చెప్పొచ్చు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంతే జార్ గంజ్ పోలీస్ స్టేషన్ కు కూత వేటు దూరంలో ప్రధాన కూడలి వద్ద చెత్త ఇబ్బడి ముబ్బడిగా పడి ఉండటం చూస్తే.. "స్వచ్ఛ వరంగల్" , "స్మార్ట్ సిటీ" అంటే ఇలాగేనా? ఉండేది అనే ఆందోళన చెందాల్సిందే. ఇష్టమొచ్చినట్టుగా చెత్తను పడేసి ఉన్న దృశ్యాలు "వేద న్యూస్ " తెలుగు దినపత్రిక కెమెరాకు చిక్కాయి.

**- కనీస బాధ్యత లేదా?**

జీడబ్ల్యూఎంసీ వారు ఏర్పాటు చేసిన చెత్త సేకరణ బాక్సులలో కాకుండా బయట రోడ్డు మీదే చెత్తాచెదారాన్ని ఇష్టమొచ్చినట్టుగా నిర్లక్ష్య వైఖరితో పడేస్తున్నారు. సదరు ప్రాంతానికి అతి సమీపంలోనే ట్రాఫిక్ కంట్రోలింగ్ పాయింట్ కూడా ఉండటం గమనార్హం. గత కొద్ది రోజులుగా సదరు ప్రాంతంలో చెత్త పేరుకుపోతున్నప్పటికీ పట్టించుకోవడం అనేది మరిచినట్టుగా కనబడుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వానాకాలం నేపథ్యంలో సీజనల్ డిసీజెస్ ముప్పు పొంచి ఉన్నది. ఈ సందర్భంలో నిర్లక్ష్య వైఖరితో చెత్తను ఇష్టమొచ్చినట్టుగా రోడ్డుమీద పడేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. వెంటనే సంబంధిత శాఖ వారు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.






# విదేశీ డిగ్రీలతో అప్పులపాలు కావొద్దు

- హైదరాబాదులోని నల్సార్ లా యూనివర్సిటీ 22వ స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్
- విదేశీ డిగ్రీలు ప్రతిభను పెంచుతాయనేది అపోహ మాత్రమేనని వెల్లడి
- భారతదేశం నాణ్యమైన న్యాయ విద్యను అందిస్తుందని ఉద్ఘాటన

**వేద న్యూస్, డెస్క్ :**

హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నరసింహ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ యూనివర్సిటీ ఛాన్సలర్ జస్టిస్ సుజయ్ పాల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీజేఐ గవాయ్ తన ప్రసంగంలో న్యాయరంగంలోకి ప్రవేశిస్తున్న యువ న్యాయవాదులకు మరియు విద్యార్థులకు కీలక సలహాలు ఇచ్చారు. విదేశీ డిగ్రీల కోసం అప్పులు చేయవద్దని న్యాయ విద్యార్థులను

మిగతా 2వ పేజీలో..

## ఇందిరమ్మ నమూనా గృహం ప్రారంభం

- పనుల పరిశీలించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**వేద న్యూస్, వీర్నపల్లి :**




వీర్నపల్లి మండల కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీర్నపల్లి మండల కేంద్రంలో చేపడుతున్న రహదారి పనుల పరిశీలించారు. అనంతరం రంగంపేట గ్రామ శివారులోని జంపన్న వాగును సందర్శించి, పూడిక తీసి,నీరు నిలువుండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈజీఎస్ లో భాగంగా అభివృద్ధి చేసి, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేకే మహేందర్ రెడ్డి, ఎస్పీ మహేష్ బి గితే, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, సెస్ డైరెక్టర్ మల్లేశం, తహశీల్దార్ ముక్తార్ పాషా, మండల ప్రత్యేక అధికారి జిల్లా యువజన క్రీడల అధికారి రాందాస్, ఎంపీడీవో వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి వృథాపై నిర్లక్ష్యం

- కేయూ వివేకానంద రీసెర్చ్ స్కాలర్ హాస్టల్‌లో.. - కేర్‌టేకర్ తీరు పట్ల విద్యార్థుల ఆవేదన

**వేద న్యూస్, వరంగల్/కేయూ:**

వివేకానంద రీసెర్చ్ స్కాలర్ హాస్టల్ (కాకతీయ విశ్వవిద్యాలయం)లో కేర్‌టేకర్ నిర్లక్ష్యంతో నీరు వృథాగా పోతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కేయూ హాస్టల్‌కు సంబంధించిన నీటి ట్యాంక్ నుంచి నిరంతరంగా నీరు పొర్లిపోతూ వృథా అవుతోంది. ఈ విషయాన్ని పలుమార్లు కేర్‌టేకర్ వేణు దృష్టికి తీసుకెళ్లినా, ఆయన నుంచిఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమని వారు తెలిపారు. కేర్ టేకర్ పదవికి తగ్గట్టుగా విధులకు నిష్టతో వ్యవహరించకుండా, ప్రాథమిక సమస్యలపైనే ఉదాసీనంగా ఉండటం హాస్టల్‌లోని వనరుల దుర్వినియోగానికి కారణమవుతోంది. విద్యార్థుల సహజీవనానికి ఇది అంతరాయంగా మారుతోందని, వెంటనే హాస్టల్ డైరెక్టర్ దీనిపై స్పందించి కేర్ టెకర్ పై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.





# డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండల కేంద్రంలో ఎస్ఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, ప్రత్యేక దళాలతో వాహనాల తనిఖీతో పాటు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారికి ఫైన్ విధించి పలు హెచ్చరికలు జారీ చేశారు. స్వయంగా ఎస్ఐ వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. వాహనదారులు భద్రత నియమాలు పాటించి వారి గమ్యాలకు చేరుకోవాలని సూచనలు చేశారు.



## అక్రమ మట్టిని తరలిస్తున్న 4 ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

ఇల్లంతకుంట మండలం గాలి పల్లి శివారులోని వరద కాలువ పక్కన ఉన్నటువంటి అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మరియు ఒక జెసిబి ని నమ్మదగిన సమాచారంతో ఇల్లంతకుంట పోలీస్, టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా చేసిన దాడిలో ట్రాక్టర్లను మరియు జెసిబి ని సీజ్ చేశారు. ప్రభుత్వ ప్రైవేటు భూమిలో తవ్వకాలు, మట్టి తరలింపు జరుపుటకు సంబంధిత శాఖల వద్ద అనుమతి తీసుకోవాలని లేనిచో వారిపైన చట్ట ప్రకారం వాహనాలు సీజ్ చేసి తదుపరి చర్య తీసుకొనబడుననీ ఎస్సై సిరిసిల్ల అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



# ప్రజలలో సైంటిఫిక్ టెంపర్ ని పెంచాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




సమాజంలో ఉన్న అనేక పీడనలు తొలగిపోవాలి అంటే శాస్త్రీయ సమాజాన్ని రూపొందించడం ఒకటే మార్గమని జెవివి రాష్ట్ర కార్యదర్శి వెంకట రమణా రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రం లో జరిగిన జిల్లా కమిటీ సమావేశ ంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులు, అధ్యాప కులు, వైద్యులు, మేధావులు, న్యాయవాదులు, పాత్రికేయులు, యువజనులు, విద్యార్థులు, శాస్త్ర-సాంకేతిక రంగాల్లో పనిచేసే వారందరూ కూడా పాల్గొని తమ వంతుగా ప్రజలలో శాస్త్రీయ దృక్పథం పెంపొందేటట్లు కృషి చేయాలని జెవివి రాష్ట్ర కార్యదర్శి తెలియజేశారు. 2025- 26 సంవత్సరానికి గాను జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు,అదేవిధంగా జనవిజ్ఞాన వేదిక రూపొందించే మాసపత్రిక చెకుముకి చందాదారులను చేయించడం వంటి కార్యక్రమాలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం నల్లగొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగినది.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాఫెల్,రాష్ట్ర కమిటీ బాధ్యులు వద్దిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,కనుకుంట్ల విద్యాసాగర్,దగ్గుపాటి విమల, జిల్లా కమిటీ బాధ్యులు మధుసూదన్,గౌతమి,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం చేసిన వ్యక్తి అరెస్టు

**వేద న్యూస్, చొప్పదండి**




చెడు వ్యసనాలకు అలవాటై ఈజీ మని సంపాదించడానికి దొంగతనాలు చేస్తున్న యువకుడిని చొప్పదండి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ చెడు వ్యసనాలకు లోనై రాగంపేట గ్రామానికి చెందిన కొలిపాక మధు కుమార్ అనే యువకుడు వివిధ చెడు వ్యసనాలకు బానిసై ఈజీగా డబ్బు సంపాదించాలని కోరికతో ఆన్లైన్ లో బెట్టింగ్ యాప్స్ ఆడుకుంటూ డబ్బు సరిపోకపోవడంతో దొంగతనం చేయాలని అనుకున్నాడు. గ్రామంలోని కొమురయ్య ఇంటిలో తేదీ 8 జులై 2025 రోజున పట్టపగలు ఇంటిలో ఎవరు లేని సమయంలో లోపలికి ప్రవేశించి తాళం వేసి ఉన్న బీరువాను పగలగొట్టి అందులో దాచి ఉంచిన ఒక తులం బంగారం, రూ.22 వేల నగదు దొంగిలించాడు. అదే రోజు ఫిర్యాదు తీసుకున్నటువంటి చొప్పదండి ఎస్ఐ నరేష్ రెడ్డి తమ సిబ్బంది తో దర్యాప్తు నిర్వహించి శనివారం ఆ వ్యక్తిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకోవడం జరిగింది. అరెస్ట్ అయిన యువకుడి నుండి బంగారం మరియు డబ్బులు రికవరీ చేసి, అతన్ని గౌరవ న్యాయ స్థానం నందు హాజరు పరచారు. ఇట్టి సందర్భాన్ని పురస్కరించుకొని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ ప్రదీప్ కుమార్ యువతకు మంచి ఆలోచన సరళి పెంపొందించుకోవాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అదేవిధంగా గ్రామాలలో, ప్రధానమైనటువంటి కూడలిలో గ్రామ ప్రజలు, ఇతర సంఘాల సహకారంతో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిందితున్ని చాకచక్యంగా పట్టుకున్న చొప్పదండి ఎస్ఐ నరేష్ రెడ్డి, సిబ్బంది ఏఎస్ఐ సమ్మయ్య, అనిల్ కుమార్, బి శ్రీధర్, ఎండి ఖలీఫాలను లను ఆయన అభినందించారు.

# కాంగ్రెస్ కి బీసీలమంతా రుణపడి ఉంటాం

**వేద న్యూస్, బోయినిపల్లి :**



దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బీసీలకు 42 శాతం రాజకీయ, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు కల్పించినందుకు బీసీలమంతా కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏనుగుల ప్రశాంత్ అన్నారు.ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీ,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ ప్రభుత్వం మాట నెరవేర్చుకున్నారన్నారు. బీసీల హృదయాల్లో చిరస్థాయిగా వారి స్థానం ఉంటుందన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలందరూ మాకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఘన విజయం అందించాలన్నారు. 32 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించి బీసీల నడ్డి విరిచిన బీ.ఆర్.ఎస్ పార్టీని పాతాళంలోకి తొక్కాలన్నారు.బీజేపీ పార్టీ బీసీలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా చూసి కేంద్రంలో గద్దెనెక్కి బీసీలపై కపట ప్రేమ చూపిస్తుందని ఆరోపించారు,దమ్ముంటే దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లను అమలు చేసి చూపించాలని డిమాండ్ చేసారు.

# విదేశీ డిగ్రీలతో అప్పులపాలు కావొద్దు

మరియు వారి కుటుంబాలను ఆయన హెచ్చరించారు, భారతదేశం నాణ్యమైన న్యాయ విద్యను అందిస్తుందని నొక్కి చెప్పారు. విదేశీ డిగ్రీలు ప్రతిభను పెంచుతాయనేది అపోహ అని, ఒకరి ప్రతిభ వారి పని ద్వారా నిరూపించుకోవాలని ఆయన అన్నారు. విదేశీ డిగ్రీల కోసం కుటుంబాలపై అప్పుల భారం మోపవద్దని ఆయన సూచించారు. న్యాయ వృత్తిలో అంకితభావం మరియు ప్రజాసేవ యొక్క ప్రాముఖ్యతను కూడా ఆయన నొక్కి చెప్పారు. ఇక, నేడు న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా సీజేఐ గవాయ్ తన ప్రసంగంలో హైలైట్ చేశారు, భారతదేశం వివిధ న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంటుందని, న్యాయవాదులు మరియు న్యాయసేవలో ఉన్నవారు అందరి మాటలను జాగ్రత్తగా వినడం చాలా ముఖ్యం అని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో కృత్రిమ మేధస్సు (ఏఐ)ని ఉపయోగించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, దీనిని సరిగ్గా ఉపయోగించుకుంటే తీర్పులను వేగంగా అందించడంలో సహాయపడుతుందని సీజేఐ తెలిపారు.

# రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు

**వేద న్యూస్, డెస్క్:**

తెలంగాణలో రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. ఇవాళ( శనివారం) నల్లగొండలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణలో 17 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు మంత్రి పొన్నం ప్రభాకర్. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్‌కి వెళుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. రాష్ట్రం వాహన సారథిలోకి ఎంట్రీ అయిందని చెప్పారు. వాహనాల ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్నీ వాహన సారథిలో చూసుకోవచ్చని తెలిపారు. ఏఐ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చేలా చేస్తున్నామని అన్నారు. యాక్సిడెంట్‌లు చేస్తే లైసెన్స్‌లు వెంటనే రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు.

# తిష్ట వేసిన సమస్యలు..!

**- పల్లెల్లో పడకేసిన పరిశుద్ధ్యం**
**- మరమ్మతులు చేయించలేక**



**వేద న్యూస్, చొప్పదండి/గంగాధర :**

గంగాధర్ మండలం ముప్పిడి నర్సయ్య గ్రామంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలసి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శ్రమదానం చేశారు. అనంతరం బూరుగుపల్లి బిఆర్ఎస్ క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పొంచి ఉన్న వ్యాధులు నిధులు లేక భారంగా మారిన ట్రాక్టర్ల నిర్వహణ నిలిచిపోయిన ఇంటింటి చెత్త సేకరణ ఇబ్బందులు పల్లె జనం పడుతున్నరని, గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందని, కాంగ్రెస్ పాలనలో పల్లెలు సమస్య లతో సతమతమవుతున్నాయన్నారు. నిధులు రాక, పాలక వర్గాలు లేక గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడి పాలన అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని, పూర్తిభారం పంచాయతీ కార్యదర్శులపైనే పడిందని, ప్రభుత్వం నుంచి రూపాయి కూడా రాకపోవడంతో కార్యదర్శులు సమస్యలను పరిష్కరించలేక పోతున్నారని వాపోయారు.

ఇంటింటి చెత్త సేకరణ సైతం లేకపోవడంతో పల్లె జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నన్నారు. పరిశుభ్రతే లక్ష్యంగా చెత్త సేకరణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని పంచాయతీలకు ట్రాక్టర్లను కొనుగోలు చేసిందని, గ్రామ జనాభాకు అనుగుణంగా ట్రాక్టర్‌తోపాటు ట్రక్కు, ట్యాంకర్‌ను సైతం అందించమని పచ్చదనం-పరిశుభ్రతకు నిలయంగా గ్రామాలను తీర్చిదిద్దేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలిచ్చాయని అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చెత్త సేకరణ వ్యవస్థ కుప్పకూలిందని, గ్రామాల్లో సమస్యలు తిష్ట వేశాయని, ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయతీలకు ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారిందని అన్నారు. ఇంతకాలం నెట్టుకొచ్చిన కార్యదర్శులు సైతం చేతులెత్తేయడంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం గ్రామాల్లో చెత్త సేకరణ కూడా చేయించ లేకపోవడంతో చొప్పదండి మాజీ సుంకె రవిశంకర్ ఆగ్రహం వ్యక్తం చేసారు.

**- మరమ్మతులు చేయించలేక**

నియోజకవర్గం లో అన్నిచోట్ల చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లు బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కొనుగోలు చేశామన్నారు. వాటికి సంబంధించి కిస్తీలు ప్రతినెలా రూ.6 నుంచి రూ.12 వేల వరకు చెల్లించాల్సి ఉండగా పంచాయతీల్లో నిధులు లేక ఏడాదినర్థం గా పెండింగ్‌లో ఉన్నాయని, ట్రాక్టర్లు తీసుకొని ఐదేండ్లు కావడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వాటిని బాగు చేయించాలంటే రూ.20 వేల రూ.30 వేల వరకు ఖర్చవుతుండడంతో పంచాయతీలకు భారంగా మారిందన్నారు. కనీసం డీజిల్ కూడా డబ్బులు లేక కొన్ని పంచాయతీల్లో వారానికి, పది రోజులకు చెత్త సేకరిస్తుండగా మరికొన్ని పంచాయతీల్లో ట్రాక్టర్లను మూలన పెట్టారన్నారు. అస్తవ్యస్తంగా పారిశుధ్యం బీఆర్ఎస్ హయాంలో పల్లెప్రగతి ద్వారా 20 రోజులపాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టి కాలువల్లో పూడికతీతలు, పిచ్చిమొక్కలు తొలగించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా పల్లెప్రగతిని పట్టించుకోకపోవడంతో పల్లెపాలన అస్తవ్యస్తమైందని, ప్రకృతి వనాలు, హరితహారంలో నాటిన మొక్కలు సైతం నీరు లేక మోడుబారిపోయాయి. వర్షాకాలం వచ్చినప్పటికీ అధికారులు పల్లెల వైపు కన్నెత్తి చూడకపోవడంతో డ్రైనేజీల్లో మురుగునీరు పారుతూ ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలుతాయేమోనని భయపడుతున్నారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడం, మురుగునీరు రోడ్డుపై ప్రవహిచడం, రోజుల తరబడి వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో పందులు, కుక్కలకు ఆవాసాలుగా మారిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం సమస్యను పరిష్కరించాలని, పల్లెప్రగతి పనుల ద్వారా పనులు చేపట్టి పల్లెలను బాగు చేయాలని కోరుతున్ననని అన్నారు. ఏడాదికిపైగా అందని బిల్లులు సర్పంచుల పదవీకాలం పూర్తయిన తర్వాత బిల్లులు అందక కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఒక పక్క బోరు మోటార్లు బాగు చేయించడం, పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతును చేయించడం చేశారు. ఎఫ్‌డీఎఫ్ నిధులు వస్తాయని అధికారులు చెప్పడంతో పనులు చేయించి ఏడాది కాలంగా కార్యదర్శులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర మాని పల్లెలపై కన్నెత్తి చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర మండలంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు క్షీరాభిషేకం

**వేద న్యూస్, చొప్పదండి :**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయుటకు మంత్రి మండలి నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మరియు చొప్పదండి శాసనసభ్యులు డా.మేడిపల్లి సత్యం లకు చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుంటి స్వరూప ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించుటకు ఆర్డినెన్స్ తీసుకొస్తున్న ప్రజా ప్రభుత్వానికి అందరి ఆశీస్సులు ఉండడంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలపర్చిన బిసి అభ్యర్థులను గెలిపించి నిబద్ధతో పరిపాలన అందిస్తున్న రేవంత్ రెడ్డి కి బహుమతిగా ఇవ్వాలన్నారు. ఇట్టి కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి రెడ్డి పద్మాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, పట్టణ అధ్యక్షులు నిజనపురం చందు, మాజీ మున్సిపల్ చైర్మన్ గుర్రం నీరజ భూంరెడ్డీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పేరుమండ్ల గంగయ్య గౌడ్, మాజీ కౌన్సిలర్ కొట్టే అశోక్, మాజీ ఎంపీపీ వొల్లల కృష్ణాహరి, మాజీ పట్టణ అధ్యక్షులు ముద్దం తిరుపతి గౌడ్, ఆత్మ ఛైర్మెన్ గుర్రం రాజేందర్ రెడ్డి, నాయకులు గుర్రం రమేష్, కడారి శంకర్, మునిగాల చందు, తాళ్ళపెల్లి శ్రీనివాస్, తొడేటి డేవిడ్, మావురపు రాములు, దుస కైలాషపతి, నేరుమట్ల మల్లేశం, మార్కెట్ డైరెక్టర్స్ ఈర్ల స్వామి, పెరుమండ్ల రవీందర్, పతిపాక నరేష్,



చుప్ప శ్రీనివాస్, చిలుముల స్వప్న, గర్శకుర్తి సునీత, గ్రామ శాఖ అధ్యక్షులు సత్తు శ్రీనివాస్, మారం శ్రీనివాస్, పేరుక శ్రీనివాస్, హన్మంతు రెడ్డి, మచ్చ రమేష్, అనుమాండ్ల సత్యం పెద్ది శ్రీనివాస్, పాలురి ప్రసాద్, కొట్టే చంద్రయ్య, కళ్యాణపు శ్రీనివాస్, చాంద్ పాషా, బండారి రాజేష్, నెల్లి సంతోష్, బోడిగె తిరుపతి, పిట్టల వెంకటేష్, నూనె శేఖర్, రవీందర్ రెడ్డి, నూనె చందు, రాజన్నల తిరుపతి, వెల్మ తిరుపతి రెడ్డి, నరుకుల్ల గంగరాజు,చీకట్ల గంగారాజు, జక్కుల జనార్దన్, జహంగీర్, ఎండీ రజాక్ నాయకులు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బీదలు ఓ వైపు, బిలియనీర్లు మరోవైపు

దేశ సంపద వికేంద్రీకరణ జరగకుండా కేంద్రీకృతం కావటంతో పేదల, ధనికుల వ్యత్యాసం తీవ్రంగా పెరుగుతూ ఉంది. కొద్ది మంది కోటీశ్వరుల వద్ద సంపద, కొద్ది మంది భూకామందుల వద్ద సాగు భూములు ఉండటంతో, సంపదలు సృష్టించే అత్యధిక మంది గ్రామీణ పేదలు, కార్మికులు , శ్రామికులు సంపదకు దూరంగా ఉన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న బడా పెట్టుబడిదారుల, బడా భూస్వాముల అనుకూల విధానాలే అందుకు కారణంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా పేదల సంఖ్య విషయంపై వేర్వేరుగా అనేక నివేదికలు, అంచనాలు ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 80 కోట్ల, 80 లక్షల మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం 101 కోట్ల మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. ఈ 101 కోట్ల పేదల్లో సగం మంది 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు కాగా, 13.5 శాతం మంది పిల్లలు 18 ఏళ్ల పైబడిన వారు ఉన్నారు. సగం మంది పేదలు పోషకాహార లోపంతో జీవిస్తున్నారు. 83.7% మంది పేదలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారని ఐక్య రాజ్య సమితి నివేదిక పేర్కొంది. మొత్తం గ్రామీణ జనాభాలో 28% మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. అనేక దేశాల్లో పేదలు ఎక్కువగానే ఉన్నారు. ఇండోనేషియాలో 4 కోట్ల, 70 లక్షల పేదరికంలో ఉన్నారు. ఆ దేశ జనాభాలో ఇది 18% కాగా, అత్యధిక పేదలు ఉన్న దేశాల్లో 5వ స్థానంలో ఉంది. పాకిస్తాన్‌లో 5 కోట్ల, 90 మంది ప్రజలు పేదరికంలో ఉండి, ఆ దేశ జనాభాలో 29% గా ఉన్నారు. అధిక పేదలు ఉన్న దేశాల్లో 4వ స్థానంలో ఉంది. ఆఫ్రికా దేశం నైజీరియాలో 8 కోట్ల, 60 లక్షల మందితో, పేదరికపరంగా 3వ స్థానంలో ఉంది. పేదలు, పేదరికంలో ఉన్న దేశాలు సబ్ సహారా ఆఫ్రికా, దక్షిణాసియాలో ఉన్నాయి.

చైనాలో పేదరికం నేడు తక్కువగా ఉంది. 2020లో 5 కోట్ల, 60 లక్షల మంది ఆ దేశ పేదరిక రేటుకు దిగువన ఉన్నారు. దేశ జనాభాలో 1.7 శాతంగా ఉంది. 2025 లో ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం పేదరికం 0.7%గా ఉంది. ప్రస్తుతం పేదల సంఖ్య ఎంత అనేది అందుబాటులో లేదు. చైనాలో కూడా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వ్యత్యాసాలు ఉన్నాయి. అమెరికాలో కూడా 2022 సంవత్సరంలో 12.4% పేదల లెక్క బయటపడింది. ఇంకా ఇతర పెట్టుబడిదారీ దేశాల్లోనూ పేదలు గణనీయంగానే ఉన్నారు. భారతదేశంలో 201112 సంవత్సరంలో పేదరికం 27.1% (34.4 కోట్లు)గా ఉంటే, 2022- 23 నాటికి 5.3% (7.5 కోట్లకు) తగ్గిందని మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. పేదరికం శాతం తగ్గినా, దేశ ప్రజల్లో 22% మంది పేదరికంలో జీవిస్తున్నారు. ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక ప్రకారం దేశంలో 35 కోట్ల మంది కనీస అవసరాలు తీర్చుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. మోడీ ప్రభుత్వం చెప్పినట్లుగా పేదరికం తగ్గితే 80 కోట్ల మందికి రేషన్ బియ్యం సప్లయ్ చేయటం ఎందుకు? భారతదేశంలో పేదరిక అంచనాపై అనేక మంది భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. దేశంలో దారిద్ర్యరేఖను అంచనా వేయటం, పేదరిక గురించి అనేక కమిటీలు చేసిన నిర్ధారణలు కూడా హాస్యాస్పదంగాను, పేదరికాన్ని అపహాస్యం చేసేవిగా ఉన్నాయి. అమెరికాలో నలుగురు కుటుంబానికి రోజుకి 63 డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉంటే పేదలుగా పరిగణిస్తారు. భారతదేశంలో అర డాలర్ కన్నా ఎక్కువ సంపాదించే వారిని పేదలుగా గుర్తించటంలేదు. ప్రపంచ బ్యాంక్ మాత్రం భారత్‌లో 2.3 డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉన్న వారిని పేదలుగా గుర్తించింది. భారతదేశంలో క్షేత్రస్థాయిలో పేదరికాన్ని అధ్యయనం చేస్తే కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంక్, ఐక్య రాజ్య సమితి చెప్పిన లెక్కలన్నీ తలకిందులు అవుతాయి.

ప్రపంచ దేశాల్లో పేదరికం పెరుగుతూ ఉంటే, మరో వైపు బిలియనీర్లు పెరుగుతూ వస్తున్నారు. 2025 నాటికి ప్రపంచ బిలియనీర్ల సంఖ్య 3,030 చేరుకుంది. వారి మొత్తం సంపద 12 లక్షల కోట్ల అమెరికా డాలర్లుగా అంచనాగా ఉంది. ప్రపంచంలో అత్యంత సంపన్నుల జాబితాలో ఎలెన్ మస్క్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతని నికర ఆస్తి 377 బిలియన్ (30 లక్షల, 60 వేల కోట్ల రూపాయలు) డాలర్లు. అతని తర్వాత మార్క్ జుకర్ బర్గ్ ఆస్తి 235 బిలియన్ డాలర్లు, జెఫ్ బెజోస్ 227 బిలియన్ డాలర్లతో మూడవ స్థానంలో ఉన్నాడు. వీరు గాక లారీ ఎల్లిసన్ 194 బిలియన్ డాలర్లు, బిల్ గేట్స్ 176 బిలియన్ డాలర్లు, స్టీవ్ బాల్మెర్ 160 బిలియన్ డాలర్లతో ఉన్నారు. భారతదేశంలో 2024లో 191 మంది బిలియనీర్లు ఉంటే, 2025లో వీరి సంఖ్య 284కు చేరింది. బిలియనీర్లలో ప్రపంచంలో మూడవ స్థానంలో ఉంది. 2015 నుండి భారతదేశంలో బిలియనీర్ల అదనంగా 123 మంది పెరిగారు.ముఖేష్ అంబానీ 8 లక్షల, 60 వేల (8.6 ట్రిలియన్ రూపాయలు. ఒక ట్రిలియన్ లక్ష కోట్లు) కోట్ల రూపాయలతో ప్రథమ స్థానంలో ఉంటే, ఆ తర్వాత గౌతమ్ అదానీ 8 లక్షల, 40 (8.4 ట్రిలియన్ల రూపాయలు) వేల కోట్ల రూపాయలతో రెండవ స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత రోష్నినాడర్ ( హెచ్‌సిఎల్ టెక్నాలజీ) 3.5 లక్షల కోట్లు, దిలీప్ షాంఘ్వీ (సన్ ఫార్మా) 2.5 లక్షల కోట్లు, అజీమ్ ప్రేమ్ జీ ( విప్రో) 2.2 లక్షల కోట్లు, కుమార్ మంగళం బిర్లా (ఆదిత్య బిర్లా గ్రూప్) రెండు లక్షల కోట్లు, సైరస్ పూని వల్లా (సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా) 2 లక్షల కోట్ల రూపాయలు, సిరాజ్ (బజాజ్ ఆటో) 1.6 లక్షల కోట్లు, రాధా కిషన్ దమానీ (అవెన్యూ సూపర్ మార్ట్) 4.4 లక్షల కోట్ల రూపాయల సంపద కలిగి ఉన్నారు.

భారత బిలియనీర్ల సగటు వార్షిక సంపద 34,514 కోట్లు. దేశంలో వెయ్యి కోట్లు సంపద కలిగి ఉన్న వారి సంఖ్య 1,539 మంది ఉంటే, అందులో 5 వేల కోట్ల సంపద కలిగిన వారు 534 మంది ఉన్నారు. నల్లధనాన్ని పరిగణనలోకి తీసుకుంటే వీరి సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఒక నివేదిక ప్రకారం భారతదేశంలోని 1% సంపన్నులు దేశసంపదలో 58% కలిగి ఉంటే, దేశంలోని 67 కోట్ల పేదల వద్ద ఒక శాతం సంపద మాత్రమే ఉంది. 13.8% ఉన్న ధనిక రైతుల వద్ద సాగుభూమి 46% ఉంటే, 84%గా ఉన్న చిన్న, సన్నకారు రైతుల వద్ద 47.3% భూమి ఉంది.

# ప్రజలు జరపైలం

**- 'పాముకాటు' ప్రాథమిక విషయాలు**

**- పాముకాటుకు చెట్లరసాలు పోయొద్దు: డాక్టర్ సురేశ్**



**వేద న్యూస్, జమ్మికుంట:**

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పాములు బయట సంచరించే సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా రైతులు పొలం గట్లు, గడ్డి వాములు, చేనుల వద్దకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. వర్షాకాలం సమయంలో పాములు భూమి లోపల నుంచి బయటకు వచ్చి సంచరిస్తుంటాయి. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పాముకాటుకు గురయ్యే అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో పాముకాటు ప్రాథమిక చికిత్స గురించి పలు జాగ్రత్తలను ప్రముఖ వైద్యులు, ఐఎంఏ హుజూరాబాద్ జమ్మికుంట శాఖ ప్రధాన కార్యదర్శి, 'సంజీవని' ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఊడుగుల సురేశ్ వివరించారు. అవేంటో మీరూ చదివి తెలుసుకోండి.

**- పాము కాటుకు చికిత్స చేసేటప్పుడు మీరు ఏమి చేయకుండా ఉండాలి?**

గట్టిగా దారంతో కట్టవద్దు, విషాన్ని నోటి తో పీల్చుకోవడానికి ప్రయత్నించొద్దు, గాయాన్ని చాకు తో కోయవద్దు,? చెట్ల ఆకుల రసం పోయవద్దు. పాములు విషపూరితమైనవి, విషం లేనివి రెండూ ఉంటాయి. పాము విషపూరితమైనది అయితే, అది తన దంతాల ద్వారా (కోరలు) విషాన్ని తాను కొరికిన దానిలోకి పంపుతుంది. ఈ విషం మానవులకు విషపూరితమైనది ప్రాణాంతకం కావచ్చు. అనేక రకాల పాములు మీ శరీరాన్ని వివిధ మార్గాల్లో ప్రభావితం చేసే కొన్ని రకాల విషాలను కలిగి ఉంటాయి, వాటిలో సైటోటాక్సిన్లు : కరిచిన చోట వాపు, కణజాల నష్టాన్ని కలిగిస్తాయి., **హెమరాజిన్స్** : రక్త నాళాలను దెబ్బతీస్తాయి., గడ్డకట్టడాన్ని నిరోధించే ఏజెంట్లు : మీ రక్తం గడ్డకట్టకుండా నిరోధించేవి, న్యూరోటాక్సిన్లు : నాడీ వ్యవస్థకు పక్షవాతం లేదా ఇతర నష్టాన్ని కలిగిస్తాయి.

**మయోటాక్సిన్లు** : మీ కండరాలను విచ్ఛిన్నం చేస్తాయి. మన రాష్ట్రంలో నాగు పాము, కట్ల పాము, రక్త పింజరా వంటి విషపూరిత పాముల సమూహాలు ఉన్నాయి

**- పాము కాటు లక్షణాలు ఏమిటి?**

మీ చర్మంపై కాటు గుర్తు, కాటు వేసిన ప్రదేశంలో రక్తస్రావం, చెమటలు పట్టడం, లాలాజలాలు కారడం, వికారం, వాంతులు, తలనొప్పి , తలతిరగడం, దృష్టి మసకబారడం ఇవి ప్రాథమిక లక్షణాలు. ఆగని రక్తస్రావం (అసాధారణ రక్తం గడ్డకట్టడం), తక్కువ రక్తపోటు , వేగవంతమైన హృదయ స్పందన రేటు మరియు బలహీనమైన పల్స్, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మీ ముఖం లేదా అవయవాలలో కండరాల బలహీనత లేదా వణుకు మరియు తిమ్మిరి తీవ్ర లక్షణాలు. విషపూరిత పాము కాటు అనేది వైద్యపరమైన అత్యవసర పరిస్థితి. పాము కాటు తర్వాత మీకు ఏవైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే హాస్పిటల్ కి వెళ్లి చికిత్స చేయడం వల్ల ప్రాణాలు నిలబడతాయి.

# పార్టీ బలోపేతమే ప్రయారిటీ



**- సైనికుడిగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ కృషి**

**వేద న్యూస్, హుజూరాబాద్/ ఇల్లందకుంట:**

కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ మార్గదర్శనలో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి సైనికుడిగా పార్టీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ కృషి చేస్తున్నారు. నిత్యం పార్టీ తరఫున వాయిస్‌గా నిలబడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా పార్టీ లైన్‌ను ప్రజలకు వినిపించే ప్రయత్నం చేస్తున్నారు. నేటి తరానికి మూడు రంగుల పార్టీ (కాంగ్రెస్) లైన్‌ను సూటిగా, స్పష్టంగా వివరించేందుకు వాట్సాప్ వేదికగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి ప్రాధాన్యతనిస్తున్నారు. హస్తం పార్టీ బలోపేతమే లక్ష్యంగా .. రాబోయే లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు కుమార్ వెల్లడిస్తున్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఆమోదం చరిత్రాత్మక నిర్ణయం

**వేద న్యూస్, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ ఆమోదం జారీ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం చారిత్రాత్మక నిర్ణయమని ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ అన్నారు. బోయినిపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేబినెట్ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకోసం 2018లో తెచ్చిన చట్టాన్ని సవరించాలని దేశంలో నే కుల గణన చేపట్టి విజయవంతం చేసుకొని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,పలువురికి ఆదర్శంగా నిలిచిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



- ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్

# జమ్మికుంటలో వరుస చోరీలు

**- రాత్రి పూట గస్తీ పెంచాలని ప్రజల వేడుకోలు**

**వేద న్యూస్, జమ్మికుంట:**

వరుస దొంగతనాలతో జమ్మికుంట పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రిపూట గస్తీ పెంచాలని మున్సిపల్‌వాసులు పోలీసులను కోరుతున్నారు. రోజుల వ్యవధిలో కిరాణం, బంగారం షాపులలో చోరీ ఘటనలు జరగగా, ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దొంగలు గడ్డపారలతో షాపుల షటర్లను పైకి లేపి చోరీ చేస్తున్నట్టు జరిగిన ఘటనలను చూస్తుంటే స్పష్టమౌతోంది. మంగళవారం వారసంత సందర్భంగా ఫోన్లు, గోల్డ్ దొంగిలిస్తున్న తీరు చూసి సమీపప్రాంతాల ప్రజలు భయపడిపోతున్నారు. మంగళవారం మార్కెట్ సందర్భంగా పోలీసులు డే టైంలో గస్తీ మరింతగా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

**- వరుస ఘటనలు**

గురువారం పట్టణంలోని మహాలక్ష్మి కిరాణంలో కౌంటర్ నుంచి రూ.20 వేలు, శుక్రవారం కల్యాణ్ జ్యువెలరీ షాపులో షటర్ పగులగొట్టి 2 తులాల బంగారం, 2 తులాల వెండి వస్తువులను దొంగిలించారు. ఈ నేపథ్యంలోనే సీసీ కెమెరాలను ప్రతి షాపు వద్ద పెట్టుకుంటే మంచిదని జమ్మికుంట పట్టణ సీఐ ఎస్.రామకృష్ణ గౌడ్ సూచిస్తున్నారు. ఇలాంటి దొంగతనాలు జరిగినపుడు సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను పట్టుకోవడం ఈజీ అవుతుందని, కేసును త్వరగా ఛేదించొచ్చని పేర్కొంటున్నారు.



# ఆ సమయంలో జైల్లో ఉన్న కవిత పోరాటం ఎప్పుడు చేశారు?

**వేద న్యూస్, డెస్క్:**

బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను తాము చేపట్టిన సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జైలులో ఉన్నారని, ఆమె ఎప్పుడు పోరాటం చేశారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు క్రెడిట్‌ను కవిత తీసుకోవడంపై టీపీసీసీ చీఫ్ స్పందించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఎప్పుడూ దృష్టి పెట్టలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన రిజర్వేషన్ల పెంపును కవిత తన విజయంగా చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ఆమె చెబుతున్న మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటోందని ఎద్దేవా చేశారు. తీహార్ జైల్లో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారని నిలదీశారు. అసలు కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలని అన్నారు. ఇలాంటి నిర్ణయాలని అభినందించేందుకు కూడా కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శించారు. గతంలో ఎన్నో బిల్లుల విషయంలో బీఆర్ఎస్ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి మద్దతు పలికిందని తెలిపారు. కానీ బీసీలకు మేలు జరిగే ఈ నిర్ణయంపై మాత్రం నోరు మెదపడం లేదని విమర్శించారు. కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్నట్లుగా విపక్షాల ధోరణి ఉందని అన్నారు.

వేద న్యూస్

ఆదివారం, జులై 13, 2025

# కాంగ్రెస్ అగ్రనేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేశ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ.. శనివారం పట్టణంలో పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. సామాజిక న్యాయం కోసం బీసీ రిజర్వేషన్ అంశానికి ముందు అడుగు వేసి.. అందర్నీ తట్టి లేపిన ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు, ఉప ముఖ్యమంత్రి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, నియోజకవర్గ ఇన్ చార్జి ప్రణవ్ కు ధన్యవాదాలు తెలుపుతూ.. వారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, నాయకులు కోటి, పిట్టల రమేష్, రావి కంటి రాజు, శ్రీపతి నరేష్, రవి, అశోక్, అజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు




**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలను శనివారం నిర్వహించారు. ఈ మేరకు మండల వైద్యాధికారి డాక్టర్ కీర్తన విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులలో మార్పులు సంభవించాయని శుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ ఎల్ స్వాతి, ఆసుపత్రి సూపర్వైజర్ జి శ్రీదేవి, ఏఎన్ఎం నల్లల పుష్పలత, నారాయణరెడ్డి ఆశా వర్కర్లు పద్మ, స్వరూప, పలు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


# క్రీడలతో మానసిక ఉల్లాసం




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా :**

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ లలో పోలీస్ ఎ టీమ్, విఎస్ సిరిసిల్ల ప్రెస్ టీమ్, పోలీస్ బి టీమ్, విఎస్ వేములవాడ ప్రెస్ టీమ్ ల మధ్య క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. శనివారం జిల్లాలోని స్థానిక కళాశాల మైదానంలో పోలీస్ మరియు ప్రెస్ మధ్య జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ లను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. మొదటగా పోలీస్ ఎ టీమ్ మరియు సిరిసిల్ల ప్రెస్ మధ్య జరిగిన మ్యాచ్ లో పోలీస్ ఎ టీమ్ గెలుపొందగా ,రెండవ మ్యాచ్ లో పోలీస్ బి టీమ్ మరియు వేములవాడ ప్రెస్ మధ్య జరుగగా వేములవాడ ప్రెస్ టీమ్ గెలుపొందారు. ఫైనల్ మ్యాచ్ పోలీస్ ఎ టీమ్, వేములవాడ ప్రెస్ టీమ్ అడగా మొదట బ్యాటింగ్ చేసిన పోలీస్ ఎ టీమ్ నిర్ణిత 10 ఓవర్లలో 77 పరుగులు చేయగా వేములవాడ ప్రెస్ జట్టు నిర్ణిత 10.ఓవర్లలో 73 పరుగులు చేసింది. పోలీస్ ఎ టీమ్ 4 పరుగుల తేడాతో గెలుపొందడం జరిగింది. మొదటి ప్లేస్ పోలీస్ ఎ టీమ్.రెండవ ప్లేస్ వేములవాడ ప్రెస్ టీమ్.మూడవ ప్లేస్ సిరిసిల్ల ప్రెస్ టీమ్.అనంతరం జట్ల సభ్యులకు జిల్లా ఎస్పీ బహమతులు అందించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని నిత్యం బిజీగా ఉండే పోలీసులు, జర్నలిస్టులు కొంత సేపు ఆహ్లాదకరంగా గడిపారు అని అన్నారు. ప్రెస్, పోలీసుల మధ్య మంచి సస్పబంధాలు ఉండడానికి ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం జరిగిందని. ప్రతి సంవత్సరం ఒక సారి ఈ విధంగా క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆటవిడుపుతో పాటు మంచి టీమ్ స్పిరిట్ వస్తుందని అభిప్రాయపడ్డారు.క్రికెట్ మ్యాచ్ ప్రారంభించే ముందు సిరిసిల్ల రిపోర్టర్ ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మరణించగా 2 నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, పాత్రికేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జ్యువెలరీ షాప్‌లో చోరీ




**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని కల్యాణ్ జ్యువెలరీ షాపులో చోరీ జరిగింది. ఈ ఘటనలో 2 తులాల బంగారం, 2 తులాల వెండి వస్తువులను దొంగిలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెంకు చెందిన భోగి వంశీకృష్ణ జమ్మికుంటలోని ధనాల కొండయ్య కాంప్లెక్స్ లో కళ్యాణ్ జ్యువెలరీ షాపు నడిపిస్తున్నుడు. శుక్రవారం రాత్రి సుమారం 7.30 గంటలకు తన షాప్‌నకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం 6 గంటలకు తన షాపు పక్కన వ్యక్తి కిరణ్ తనకు ఫోన్ చేసి షాపు షట్టర్ పగులగొట్టి ఉందని తెలిపాడు. వెంటనే వంశీకృష్ణ తన షాపునకు వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. షటర్ పగులగొట్టి ఉండగా, షటర్‌లోకి దొంగలు చొరబడినట్టు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రామకృష్ణ గౌడ్ వెల్లడించారు. దొంగలను త్వరలో పట్టుకుంటామని పట్టణ సీఐ తెలిపారు. క్లూస్ టీం ఆధ్వర్యంలో ఆధారాలను సేకరించారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. షాపు యజమానిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేదు



**వేద న్యూస్, తంగళ్ళపల్లి :**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేదని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ మంజూరు పత్రాలు ఎంపీడీఓ కార్యాలయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. లబ్దిదారులు వారికి కేటాయించిన ఇండ్లలోకి వెంటనే వెళ్ళాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగిందని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా రాళ్లపేట గ్రామంలో నిర్మిస్తున్న ఇండ్లు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై పీడీ హౌసింగ్, ఎంపీడీఓను అభినందించారు. మట్టి కోసం ఆందోళన చెందవద్దుమట్టి కోసం లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారని తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తమ గ్రామంలోని చెరువు,తమకు సంబంధించిన పొలంలో ఉన్న మట్టినివినియోగించుకునేందుకు గ్రామ పంచాయితీ కార్యదర్శి ద్వారా తహశీల్దార్ కు తెలిపితే ఆయన అనుమతి తీసుకున్న తర్వాత ఆ మట్టిని గృహ నిర్మాణ అవసరాలకు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కెకె.మహేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప, వైస్ చైర్మెన్ నర్సింగం, పీడీ హౌసింగ్ శంకర్, డీపీఓ షర్ఫుద్దీన్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ కల్లు బాధితులకు డయాలసిస్

**వేద న్యూస్, డెస్క్:**

కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితులకు వైద్యం కొనసాగుతోంది. కల్తీ కల్లు బారిన పడిన వారిలో 33 మంది నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిలో కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే కిడ్నీ పనిచేయని బాధితుల సంఖ్య తొమ్మిది మందికి చేరింది. ఇప్పుడు తాజాగా మరో ఇద్దరు బాధితులకు కూడా డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో 11 మంది ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇంకో 12 మందిని అబ్జర్వేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు డాక్టర్లు. మరో 19 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ కల్తీ కల్లు ఘటనలో ఇప్పటి వరకు తొమ్మిది మంది మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇక కల్తీ కల్లు ఘటనలో ప్రధాన నిందితుడు కూన సత్యం గౌడ్‌ను కూకట్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన కుమారులు రవితేజ గౌడ్, సాయితేజ గౌడ్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. కూన సత్యం గౌడ్ అరెస్ట్‌తో నిందితుల సంఖ్య ఐదుకు చేరింది. అలాగే ఈ ఘటనలో బాల్‌నగర్ ఎక్సైజ్ సీఐపై వేణుకుమార్‌పై వేటు పడింది. కల్తీ దందాపై చర్యలు తీసుకోని కారణంగా ఎక్సైజ్ సీఐను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అంతేకాకుండా మరికొంత మందిపై విచారణకు ఎక్సైజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. కల్తీ కల్లు ఘటనపై కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లలో మూడు కేసులు, బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఆరు కేసులు నమోదు అయ్యాయి.

# సీఎం రాష్ట్రంలో ఉండేది తక్కువ ఢిల్లీలో ఎక్కువ

**వేద న్యూస్, డెస్క్:**

జిల్లాలోని కేశంపేట మండలం కాకునూర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గృహలక్ష్మి పథకాన్ని వెంటనే ప్రారంభించాలంటూ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉండేది తక్కువని.. ఢిల్లీలోనే ఎక్కువగా ఉంటారని వ్యాఖ్యలు చేశారు. చదువుకునే విద్యార్థినులకు ఇస్తానన్న స్కూటీలు ఎక్కడ అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే ఆడపిల్ల పెళ్ళికి లక్ష నగదుతో పాటు తులం బంగారం అన్నారని.. ఈ 18 నెలల్లో ఎక్కడైనా ఇచ్చారా అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డికి కేసీఆర్ జపం చేయడం తప్ప పాలన తెలీదంటూ విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలల్లో మొత్తం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే ఉన్నారని అని ఆరోపించారు. సీఎం సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్‌లో అంబులెన్సులలో కనీసం డీజిల్ పోసే పరిస్థితి లేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే రెండు లక్షల కోట్ల అప్పు చేసిందని తెలిపారు. రేషన్ షాప్‌ల్లో ఇస్తున్న సన్న బియ్యంలో 50 శాతం దొడ్డు బియ్యమే అని నిరూపిస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరారు. ఫ్రీ బస్సు పేరున గ్రామాలకు బస్సులు తగ్గించారని ఫైర్ అయ్యారు. ఈ ప్రభుత్వం పని చేసే ప్రభుత్వం కాదని.. వెంటపడి పని చేయించుకోవాలని ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు చేశారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073